ప్రజా సమస్యలపై గరంగరం

- అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిలర్లు
- రేషన్ సరకుల పంపిణీపై చర్చ
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

తుని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకోవడంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్ పర్సన్ సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రవేశపెట్టిన 32 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

డీలర్లపై చర్యలేవీ

జీరో అవర్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు బ్లాక్ మార్కెట్‌లో అమ్మి కార్డుదారులకు ఇవ్వడం లేదని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అవినీతికి పాల్పడిన డీలర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈ అంశంపై సభలో వాడివేడిగా చర్చ జరిగింది. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఎందుకు ప్రజలకు చేరడం లేదని చైర్‌పర్సన్ సుధారాణి ప్రశ్నించారు. వ్యక్తిగత లబ్ధి కోసం ప్రభుత్వాన్ని ఇరికించే ప్రయత్నం చేస్తే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మన మున్సిపాలిటీ మన బాధ్యత కార్యక్రమంలో ఇంటింటికీ వెళితే అర్హత ఉన్నా ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీలో స్థలాలు రాలేదని పలువురు ఫిర్యాదు చేశారని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు తెలిపారు. దీనిపై సుదీర్ఘంగా చర్చ జరిగింది.

జీర్ అవర్‌లో ప్రశ్నల వర్షం

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించిన జీరో అవర్‌లో సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. జగనన్న కాలనీల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, కొందరికి ఇచ్చిన ఇంటి పట్టాల్లో భర్త పేరు, ఆధార్‌కార్డు తప్పుగా నమోదు కావడంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు తమకు రాలేదని పలువురు మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చారని కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు గృహ నిర్మాణశాఖ అధికారులను ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపి మళ్లీ అందరికీ పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 6, 13 తేదీల్లో తుని పట్టణ పరిధిలో నిర్వహించే క్యాంపులను విజయవంతం చేయాలని అధికారులు కోరారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, పోలీస్, ప్రణాళికా విభాగం, శానిటేషన్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. వీరంతా పట్టణంలోని వార్డుల్లో ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని చైర్‌పర్సన్ సుధారాణి ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కమిషనర్ ప్రసాదరాజు, డీఈఈ ప్రకాశరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.




సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి.. సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట



కోటనందూరు హైస్కూల్‌కు స్టీల్ వంట పాత్రలు అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు ప్రభుత్వం సరఫరా చేసిన స్టీల్ వంట పాత్రలను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాణ్యమైన వంట పాత్రలతోనే విద్యార్థుల ఆరోగ్యం సాధ్యమని భావించిన ప్రభుత్వం పాఠశాలలకు స్టీల్ వంటపాత్రలను సమకూర్చిందన్నారు. జగనన్న గోరుముద్ద నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, వార్డు మెంబర్ పెద్దిర్సి రమేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సచివాలయానికి బీరువా బహూకరణ



సచివాలయానికి బీరువా అందజేస్తున్న కౌన్సిలర్ కిషోర్

ఏలేశ్వరం: ప్రజలకు నిత్యం సేవలు అందించే సచివాలయానికి ఫర్నీచర్ లేకపోవడంతో కౌన్సిలర్ దోణే కిషోర్ స్పందించారు. తన సొంత సొమ్ములతో బీరువాను కొనుగోలు చేసి బహూకరించారు. స్థానిక నగర పంచాయతీ రెండో వార్డు కౌన్సిలర్ దోణే కిషోర్ తన పరిధిలోని 6వ సచివాలయానికి శుక్రవారం ఇనుప బీరువాను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, కడింశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తుని: వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తుని సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. తుని గణపతినగర్‌లో శుక్రవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మానసిక ఒత్తిడికి లోను కాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయులు, కుచ్చర్లపాటి భీమరాజు, తాకాశి అప్పారావు, భీమనాదుల గణేష్, పేరూరి కృష్ణ, వంగలపూడి గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తుని రూరల్: తుని రోటరీక్లబ్ సౌజన్యంతో మండలంలోని నాలుగు పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. తేటగుంట, ఎన్.సూరవరం, కొలిమేరు, ఎస్.అన్నవరం శివారు రామకృష్ణా నగర్ పాఠశాలల్లో విద్యార్థులకు రోటరీక్లబ్ ప్రతినిధులు రూ.1.15 లక్షలు విలువ చేసే 20 బెంచీలు, 500 అట్టలను అందజేశారు. గ్రామీణుల్లో విద్యను ప్రోత్సహించేందుకు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు రోటరీ క్లబ్ కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ జి.బుచ్చిరాజు తెలిపారు. రోటరీక్లబ్ ప్రతినిధులు సీహెచ్.మంగరాజు, ఉమాశంకర్ సాయి, ఎస్.రామచంద్రరావు, పి.ప్రసాద్, ఎన్.వీర్రాజు, సరస్వతీ విద్యా సేవా సమితి వ్యవస్థాపకుడు గొర్లి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన పది మంది బాలురు, మరో పది మంది బాలికలకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. దాతలు పులవర్తి విజయ్ కుమార్, పులవర్తి గోపాలకృష్ణమూర్తి, పులవర్తి స్వరాజ్యం, అద్దేపల్లి రాజా, అద్దేపల్లి రత్నకుమారి, సానా నూకరాజు నాయుడు ఈ స్పోర్ట్స్ కిట్లను సమకూర్చారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని దాతలు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు శివారు దాబాల వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైవేపై విశాఖ వైపు వెళుతున్న మోటార్ సైకిలిస్టును వెనక నుంచి వస్తున్న హైషర్ మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను జగ్గంపేట మండలం రామవరం శివారులో రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది సతీష్, కుమార్ అడ్డుకుని గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేయనున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న పీఠాధిపతి స్వామి సూర్యానంద

ఏలేశ్వరం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని లక్ష్మీనర్సాపురం పీఠాధిపతి స్వామి సూర్యానంద అన్నారు. పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని సిరిపురం చిద్గగనందా గీతాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి దయానందా భారతీస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి సూర్యానంద మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలన్నారు. ప్రపంచంలో హిందూ ధర్మానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. హిందూ ధర్మాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో యల్లపు సూర్యనారాయణ, తోట వీరమహేశ్వరరావు, ఆకుల నూకపతిరావు, మజ్జూరి వెంకటేశ్వర్లు, అల్ల సీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిర, చండీ హోమాలు



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యంగిర, చండీ హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 101 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి చండీహోమంలోనూ, 33 మంది ప్రత్యంగిర హోమంలో పాల్గొన్నారు. రూ.1,116 చొప్పున ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసి ముగ్గురు భక్తులు చండీహోమంలో, మరో నలుగురు భక్తులు ప్రత్యంగిర హోమంలో పరోక్షంగా పాల్గొన్నారు. ఈ టిక్కెట్లు విక్రయం ద్వారా దేవస్థానానికి రూ.1,08,312 ఆదాయం సమకూరింది.

వైభవంగా సుదర్శన హోమం

తుని రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం సుదర్శన హోమం నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పండితులు శాస్త్రోక్తంగా హోమం జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. లోవదేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో పండితులు మహాచండీ హోమం నిర్వహించారు.

పంటలకు ఈ-కేవైసీ తప్పనిసరి

గోకవరం: ఈ-పంట నమోదు చేసుకున్న రైతులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ-కేవైసీ వేయని రైతులు పంట రుణాలు, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకాలు పొందడానికి అనర్హులన్నారు. ఈ-కేవైసీ నమోదు చేసుకోని రైతులంతా వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

2న ప్రత్తిపాడులో పోలీసు స్పందన

రౌతులపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 2న ప్రత్తిపాడులో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రౌతులపూడి ఎస్‌ఐ అబ్దుల్ నబీ శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వచ్చే నెల 2న నిర్వహించే జిల్లాస్థాయి పోలీసు స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు కోరారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రత్తిపాడు ఉప ప్రణాళికా ప్రాంతం జిల్లా కేంద్రానికి దూరం కావడంతో ముఖ్యంగా గిరిజనులు తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్పీకి నివేదించలేకపోతున్నారన్నారు.గిరిజనుల సౌకర్యార్థం ప్రత్తిపాడులో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

తెగుళ్లకు నివారణతో అధిక దిగుబడులు



యర్రవరంలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ వెంకట నరసింహరావు

ఏలేశ్వరం: వరి సాగులో తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం ఏరువాక కేంద్రం డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహరావు అన్నారు. మండలంలోని యర్రవరం, చిన్నింపేట, తిరుమాలి గ్రామాల్లో వరిపొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంట ఈనిక దశలో ఉందన్నారు. సాంబమసూరి రకం వరి పంటను అక్కడక్కడ ఎండాకు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు పొలంలో ప్రస్తుతం ఉన్న నీరును తీసివేసి కొత్త నీరు పెట్టాలన్నారు. నత్రజని ఎరువు వేయకుండా ఎకరాకు 15 కేజీల పొటాష్ వేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ప్లాంటోమైసిన్ ఒక గ్రాము, హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నానిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేట, తాళ్లూరు, మల్లేపల్లిలో పంట పొలాలను శుక్రవారం పెద్దాపురం ఏరువాక కేంద్రం డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు పరిశీలించారు.

వరిలో నల్లి ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట: ప్రస్తుతం వేడి వాతావరణంతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో వరిలో నల్లి ఉధృతి పెరిగే అవకాశం ఉందని పెద్దాపురం ఏరువాక కేంద్రం డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. జగ్గంపేట మండలం రామవరంలో వరి పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వరి ఈనిక దశలో ఉందన్నారు.పంట సంరక్షణకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి



గడ్డిపేట పాఠశాలలో మొక్క నాటుతున్న వైస్ ఎంపీపీ గంగబాబు, డిప్యూటీ డీఈవో సుభద్ర

తొండంగి: ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో కల్పించిన మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు సూచించారు. మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేటలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారం రూ.27 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనం, తలపంటిపేటలో రూ.10 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం డిప్యూటీ డీఈవో సుభద్ర అరబిందో ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకుడు గంగిరి అడివియ్య, వైస్ ఎంపీపీ-2 యాదాల రమణ, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఎంఈవో షేక్‌బాబ్జీ, అరబిందో ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, దడాల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా అన్నసమారాధనలు

కిర్లంపూడి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. రమణయ్యపేటలోని గణేశ్ అండ్ గద్వాల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద, కిర్లంపూడి శివారు వనదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగియడంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక 3వ వార్డులోని మాలకొండయ్య ఆసుపత్రి సమీపంలో, పాత అడ్డతీగల రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అన్నదానాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నేతలు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, యజనగిరి ప్రసాద్, పైల విజయ్‌కుమార్, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

శంఖవరం: స్థానిక వైష్ణవి కాలనీలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు భక్తులకు వడ్డన చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

మహిళా సంఘాలకు రూ.4 కోట్ల రుణాలు



జగ్గంపేటలో డ్వాక్రా మహిళలకు రూ.4 కోట్ల రుణాల చెక్కు అందజేస్తున్న నాయకులు

జగ్గంపేట: మహిళల ఆర్థికాభివృద్ధికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ సహకరిస్తుందని ఎస్‌బీఐ తుని రీజినల్ మేనేజర్ ఎం.సురేష్‌బాబు అన్నారు. జగ్గంపేట వెలుగు కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాల సమావేశం జరిగింది. 30 డ్వాక్రా గ్రూపులకు మంజూరైన రూ. 4 కోట్ల చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో మహిళలు వ్యక్తిగతంగా వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు అందజేస్తామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట స్టేట్ బ్యాంక్ మేనేజర్ కల్యాణ్ శ్రీనివాస్, ఎంపీడీఓ వసంతకుమార్, వెలుగు ఎంపీఎం జగదీశ్వరి, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌కు చెందిన కిలాని అప్పారావు (68) ఈ నెల 28న రామవరం బజారుకు వెళ్లి సరకులు తీసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న మోటారు సైకిల్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అప్పారావును ప్రాథమిక చికిత్స నిమిత్తం జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు భార్య కిలాని పాపయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రామకృష్ణ తెలిపారు.

భూముల రీ సర్వేపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

జగ్గంపేట: జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకంలో చేస్తున్న భూముల రీ సర్వే పారదర్శకంగా చేయాలని వీఆర్‌ఓలు, సర్వేయర్లకు పెద్దాపురం ఆర్డీఓ కె.సీతారామరావు సూచించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం భూముల రీ సర్వేపై వీఆర్‌ఓలు, సర్వేయర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేపై రైతులకు ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. రైతుల సమక్షంలోనే వారి భూములకు కొలతలు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



జగ్గంపేటలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న మండల సచివాలయాల కన్వీనర్ రాజా

జగ్గంపేట: పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో అందించే సేవలు వెలకట్టలేనివని మండల సచివాలయాల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా అన్నారు. జగ్గంపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పారిశుధ్య కార్మికులకు రుణపడి ఉంటారన్నారు. పారిశుధ్య కార్మికులకు ఏ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ నాయకుడు బచ్చల సుధీర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

తుని: పురపాలక సంఘంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. తుని వీరవరపుపేట అర్బన్ హెల్త్ సెంటర్లో కార్మికులకు శుక్రవారం పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ బీపీ, సుగర్, టీబీ తదితర పరీక్షలు నిర్వహించారు. పలువురుకి బీపీ ఎక్కువగా ఉండడంతో మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు సూచించారు. వైద్య శిబిరంలో 70 మందికి పరీక్షలు నిర్వహించారని ప్రజా ఆరోగ్య శాఖ అధికారి శేఖర్ తెలిపారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

గండేపల్లి: హైవేపై కారు అదుపు తప్పిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు మండలంలోని మల్లేపల్లి కొత్తూరు సెంటర్లో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది ప్రమాదంలో దెబ్బతిన్న కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

దుర్గాదేవి ఆలయానికి మైక్ సెట్ వితరణ



హైందవ సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్గా ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన ఆలయం వద్ద గల దుర్గాదేవి ఆలయానికి దానధర్మ ట్రస్ట్ మైక్ సెట్‌ను బహూకరించింది. ఈ మైక్‌సెట్‌ను హైందవ సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు పెనుగొండ దుర్గా ప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పెనుగొండ దుర్గా ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి సత్తిబాబు, సభ్యులు జంపా బ్రహ్మ గణేష్, ఇల్లింక వీరబాబు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్నేహభావంతో మెలగాలి

- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

కిర్లంపూడి: ప్రజలు రాగద్వేషాలకు పోకుండా ఒకరికొకరు స్నేహభావంతో మెలగాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. మండలంలోని రాజుపాలెంలో శుక్రవారం రాత్రి ఎస్సై పి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శాంతిభద్రతలు, చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లతాకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో వచ్చే చిన్నచిన్న తగాదాలకు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం సరికాదన్నారు. తద్వారా ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగడం వల్ల ఆర్థికంగా నష్టపోతారన్నారు. గ్రామ పెద్దల సమక్షంలోనే సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గణేశుల లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

కోటనందూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ కోరారు. మండలంలోని బిళ్లనందూరులో పంచాయతీ, వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లకు శుక్రవారం ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అక్టోబర్ 2న నిర్వహించే స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమాన్ని సైతం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి చైతన్యపృథ్వి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నుంచి అక్టోబర్ 18 వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ శుక్రవారం తెలిపారు. గ్రామాల్లోని ప్రజలందరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శనివారం కేఈ చిన్నయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం నుంచి నవంబర్ ఒకటి వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. శనివారం ఎస్.చామవరంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తారన్నారు. తేటగుంట, ఎస్.సూరవరం పీహెచ్‌సీ వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారని చెప్పారు.

గండేపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గండేపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. శనివారం నుంచి అక్టోబర్ 21 వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.

గోకవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోకవరం ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ ఓ.శంకర్ సూచించారు. మండలంలోని కృష్ణునిపాలెంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కృష్ణునిపాలెంలో మూడు వేల జనాభాకుగాను 1578 మందిని స్క్రీనింగ్ చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సాత్విసుధ, పవన్, వేద కుమారి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని వీరవరం జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తోట రవి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 31 వరకూ నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు కోరారు. వీరవరం ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాట్లను శుక్రవారం స్థానిక సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, పంచాయతీ సెక్రటరీ విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ పసుపులేటి సతీష్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపీపీ దడాల సువర్ణలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత తదితరులు ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. శనివారం నుంచి వచ్చే నెల 30 వరకూ అన్ని గ్రామాల్లోనూ ఈశిబిరాలు నిర్వహిస్తారన్నారు.

జగ్గంపేట: స్థానిక సచివాలయం- 3లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభిస్తారని మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా తెలిపారు.